# మంచం మహారాణి
## (లేక)
# చిట్టెమ్మ చీకటికథ

చిట్టెమ్మ అసలుపేరు కామేశ్వరి. కామేశ్వరి అంటే ఎవరికీ తెలీదు.

చిట్టెమ్మను పన్నెండోఏట సుబ్బారావుకిచ్చి పెళ్ళిచేశారు. సుబ్బారావు మెట్రిక్యులేషన్ తప్పి అల్లరి చిల్లరిగా తిరుగుతున్నాడని చెప్పి స్వయానా వేలువిడిచిన అప్పకూతురు చిట్టెమ్మనిచ్చి ముడెట్టేసి పెద్దలంతా గొప్ప పనేచేసినట్లు సంతోషించారు. అల్లరి చిల్లరి తిరుగుళ్ళన్జెప్పి సుబ్బారావు మహాయిడిగా ప్రేజేగిపోలేదు.

ఓ పరీక్ష ఫేలయేడు.

ఓ సుందరరావుగారి సుశీలో శాంతో వాంతో — దాన్తో చిన్న దోస్తీ చేసేడు. కడుపో కాలో దిక్కుమాలినఖర్మ.... మావాడు కాద న్నారు గట్టిగాఅంతే — అవతలవీధివాళ్ళు గదిలోపెట్టి మెత్తగాచెప్పి

జూసి వినకపోతే చితక బాదేశారు. పోలీసుల్ని వ్యవహారంలోనికి జొరబడ నియ్యకుండా వున్న పెద్దలు సర్ది జెప్పేరు.

అప్పుడు వెంకటలక్ష్మీనరసమ్మ కంగారుపడిపోయి వేలువిడిచిన తమ్ముడెక్కడ చేయిజారి పోతాడోనని అవురావురు మంటున్న కుర్రాడికి పన్నెండేళ్ళ అబ్బనాకారపు పిల్ల తనకూతురు కామేశ్వరి ఉరఫ్ చిట్టెమ్మను ముడెట్టేసింది. పెండ్లిలో పేరంటాళ్ళు సుబ్బారావు ఆకలిని పసికట్టేసి ముసిముసి నవ్వులు నవ్వుకున్నారు.

"అబ్బ — అదోలా చూస్తాడమ్మా తినేసేట్లు" అని కళ్లు తిప్పు కున్నారు.

పెళ్ళికూతురిమీద పన్నీరు చల్లమంటే పేరంటాల మీదకూడా చల్లాడు. మల్లెపూల చెండును పెళ్ళికూతురిమీదే కాకుండా యిటూ అటూ విసిరేడు.

పెళ్ళిలో కాస్త సరదాగావుండే ఆడవాళ్ళందరితోనూ వరసపెట్టి సరసం ఆడేడు.

ఆ వాలకం అదీ కనిపెడుతున్న పెద్ద ముత్తయిదువులు కుర్రాడు అట్టేకాలం ఆగేట్టులేడే — ఇదేమో చూస్తే సన్నగా ఎలకలావుందీ అని అనుకున్నారు.

పెళ్ళికొడుకుతో సరదాగావుంటే తప్పుబట్టని వాళ్ళసంగతేమో కాని, ఇద్దరు ముగ్గురు ఆడవాళ్ళు మొగాళ్ళచేత చివాట్లూ దెబ్బలూ కూడా తిన్నారు. చెండు మీదకు విసిరించుకున్నావనీ. మీదవాలిపోయి నీతో మాట్లాడాడనీ.

వాడెదురుగుండా ఎందుకు కూర్చున్నావే నీ మొహం మండా, అంటే వాడు మీదకు వాలితే అసలెందుకటా వాలనిచ్చావనీ — యివే

చిలికి చిలికి గాలివాన! కళ్ళనీళ్ళతో, చిట్టీ పొట్టీ చివాట్లతో, దెబ్బలతో ఆగింది రగడ. సర్దుకు పోవాలి అని పెద్దవాళ్ళుకూడా కూకలేసిన మీదట. పెళ్ళికొడుకు అల్లావున్నాడుకాని కొంపలు కూల్చే కారివేనే — అని గింజుకున్నారు.

వెంకటలక్ష్మీ నరసమ్మకి వేలు విడిచిన తమ్ముడిని పైకి పోనివ్వకుండా కూతుర్నిచ్చి కట్టేసుకున్నాననే ధీమా కొంత ఆనందానిచ్చిందని చెప్పాలి. కాని సుబ్బారావు పెళ్ళికూతురికేసి చిరాగ్గా చూసేవాడు. ఇది ఎదిగి ఏపయి కాపరానికి రావడం, ఎప్పుడూ — అనే చింతే పట్టుకుని అతడి మనస్సులో యీ అబ్బనాకారపు పిల్లకు బొత్తిగా చోటులేకుండా పోయింది.

పెళ్ళి వలన సుబ్బారావు గౌరవం ఆట్టే పెరగలేదు. చిట్టెమ్మ స్టేటస్ పెరిగింది

సుశీలో, శాంతో; వాంతో ఆ గొడవచప్పగా చల్లారిందికాని సుబ్బారావు చల్లారలేదు. వెంకటలక్ష్మీనరసమ్మ తమ్ముడిని బాగా చూడడం మొదలెట్టింది. పెట్టెడు బట్టలు కుట్టించింది. ఐదు, పది, పాతికా పరకా యిస్తూందేది.

చిట్టెమ్మ పని అక్కతమ్ముళ్ళ మధ్య రాయబారాలూ, డబ్బుపత్రావే అన్నప్పుడు పట్టుకెళ్ళడం యివ్వడం, తక్కువ ఎక్కువ అయితే చివాట్లు తినడం.

ఈ పెళ్ళివలన సుబ్బారావుకీ చిట్టెమ్మకీ మధ్య కలగవలసినంత ఆపేక్ష అభిమానాలు కలలేగదు. ఇరువురి మధ్య ఆకర్షణగాని కొత్తగాని ఏమీలేదు. ఇదివరకు వేలువిడిచిన మేనమామ, యిప్పుడు మొగుడు — అంతే!

సుబ్బారావు పరిస్థితి బాగాలేదు. పొలంమీద శిస్తులు చేతికి చిక్కడంలేదు. పెళ్ళయింది. యిక నాలుగు డాళ్ళు సంపాదించే ప్రయత్నం చేసుకో, తిని తిరిగితే ఏమొస్తుంది? ముందు ఆ మెట్రిక్యులేషన్ పూర్తి చెయ్యి — టైపూ షార్టుహాండూ నేర్చుకో ఇన్‌స్టిట్యూట్‌లోచేరు అని వుండసలిపినట్లు సలపడం మొదలెట్టారు, సుందరరావుగారింట్లో తన్ని నప్పుడు బాధకంటే, యిప్పుడు యీ పెళ్ళయాక వాళ్ళ బాధ ఎక్కువ యిందిసుబ్బారావుకి. ఆ బాధకల్లా కారణం ముల్లులా గుర్తుకొచ్చేది చిట్టెమ్మ. చిట్టెమ్మఎంతకీ పెద్దమనిషి కావడంలేదే,ఎంతకీపరువానికి రావడం లేదే అని రావుకి వూఁ హూఁ తొందర—

ఆ తొందరలో సుబ్బారావు మరో చిన్న తగాయిదా కొనితెచ్చుకున్నాడు. రేవతి అని పినతల్లికూతురు, పెళ్ళయింది. దానిమొగుడు ఢిల్లీలో ఏదో వుద్యోగం ఎలగబెడుతున్నాడు. పదివేలు కట్నంపోసి హోమగా పెళ్ళిచేశారు, చిట్టెమ్మ పెళ్ళికి రాలేదు, సుబ్బారావుకూడా మేనమామే గనుక — వచ్చి నాల్రోజులుండి చూసి పోదామని దిగింది. పిల్లకికాస్త సరదా ఎక్కువ.

రేవతిని చూడగానే దీన్నయినా పెళ్లాడానుకానే అని గిలగిలా చేపలా కొట్టుకున్నాడు సుబ్బారావు.

రేవతి, చిట్టెమ్మ కలసి బొమ్మ బొరుసులా తిరిగేరు. ఒక కంచంలో తిన్నారు ఒక మంచంలో పడుకున్నారు. ఊసులాడుకున్నారు. సరదాకి డబ్బెట్టి పేకాడారు. సుబ్బారావుదంతా వూడ్చుకుపోయింది. రేవతి గెల్చింది.

గేదె పెరుగు, దంపుడు బియ్యమన్నం, చిక్కని కాఫీ. కొబ్బరి తోటలవెంట షికార్లు, పొలంగట్లు, చక్కగా ప్రశాంతంగా కన్నుల పండు

వులాగుండే పల్లెటూరి సొగసులు రేవతికి ఎంతో నచ్చాయి, రేవతి ఎంతో నచ్చింది సుబ్బారావుకి.

ఆ రాత్రే సుబ్బారావు రేవతి, చిట్టమ్మ కలిసి పడుకుంటే రేవతి కాలిమీద గోకాడు, రేవతి కంగారు పడిపోయి కేకలు పెడితే యింట్లో అంతా లేచారు. దొంగ కాదని తెలుసుకోవడానికొట్టేసేపు పట్టలేదు.

రేవతి భయపడిపోయి ఏడుస్తూ కూర్చుంది.

అసలా గదిలో నీకేం పని ఎందుకెళ్ళావని నిలదీసి అడిగేరు.

వెంకటలక్ష్మి నరసమ్మ, వాడిపెళ్ళాంవుంది దానికోసం వెతుక్కుంటూ వెళ్లాడని వాదించింది.

అహః వాడి పెళ్లాం అయితేమటుకు దాన్తో అర్ధరాత్రి వీడికేం పనొచ్చిందని అంతా విసుక్కున్నారు.

సుబ్బారావు యిల్లు వదలిపెట్టి లేచిపోతానని కూర్చున్నాడు. కాలవ గట్టు రేవుదాకా వెళ్ళిపోయాడు అలిగి.

వెంకట లక్ష్మినరసమ్మ అల్లుడైన తమ్ముడిని వెంబడించి కాలవ రేవు పానంచాల మీద కూచోబెట్టి జలకడిగినట్లు కడిగేసింది,

"దాన్ని రేపే బండికట్టి యిక్కడ్నుంచి పంపేస్తాను. దాని కాపరంలో నిప్పులోసేలాగున్నావు. నిన్ను నమ్మలేక ఛస్తున్నాను. పద—పద అని రెక్కపుచ్చుకుని లాగింది.

సుబ్బారావు తను వేరే పడుకో దల్చుకోలేదని యిప్పటి కిప్పుడీ రాత్రి కార్యం జరిగిపోవలసిందేనని మంకు పటు పట్టాడు.

పిల్ల పెద్దమనిషి కాలేదురా — పట్టుమని పన్నెండేళ్ళయినా నిండ లేదురా! అని లక్ష్మినరసమ్మ నెత్తి నోరు బాదుకుంది.

నసెమిరా వినిపించుకోలేదు.

నేను నీ కూతుర్ని ఏలుకొనేదిలేదు పొమ్మన్నాడు.

తన్ను తిట్టుకుంటూ లక్ష్మీనరసమ్మ

అల్లాగేకానీ—అంటూ తమ్ముడ్ని లాక్కొచ్చి రేవతిని బయటకు రమ్మనమని ఆ గదిలోకి వాడిని తోసేసి తలుపు గొళ్ళెం వేసింది.

కొంత సేపు నిశబ్దంగానే వుంది కాని తరువాత చిట్టెమ్మ గావు కేకలు ఏడుపు వినిపించాయి.

పెద్దమనిషికాని పిల్లను గదిలో పెట్టి పులిని విడిచినట్లు సుబ్బారావుని వదిలేసింది వెంకటలక్ష్మీనరసమ్మ

ఆ రాత్రి చిట్టెమ్మను చావచితగకొట్టి నెత్తురు కళ్ళ చూసేడు సుబ్బారావు.

తెల్లార్లు చిట్టెమ్మ గోలపెడుతూనే వుంది.

లక్ష్మీనరసమ్మ కళ్ళు మూసుకుని దేవుడి పటంముందు నమస్కారం చేస్తూకూర్చుంది.

ఆ ఉదయం రేవతిని బండి కట్టించి వాళ్లింటికి పంపించేసారు. జరిగిన అమానుషం తలుచుకుని హడిలిపోయింది. ఆ అమ్మాయి పైకనలేదు. ఏంజన్మ — దిక్కుమాలిన జన్మ, ఆడ జన్మ! అని దిగాలుపడి పోయింది.

ఆ ఉదయమే చిట్టెమ్మను ఆసుపత్రిలో చేర్చాల్సివచ్చింది, లేడీ డాక్టరు రేఫ్ అనుకుని చాలా కంగారు పడింది.

"అబ్బే ఏం లేదండీ మావాడు కాస్త తొందర పడ్డాడు ఇహిహీ! అని నవ్వేశారు.

మీరు మనుష్యులా — పశువులా? నేను మీమీద కేసు పెడ్తాను.

మీరు పత్రి రాస్కెల్సు లాగున్నారని లేడీడాక్టరు ఒందులు త్రొక్కింత నోట్లు పారేసాక చిందులు త్రొక్కడం మానేసింది. 'ఆ పసిపిల్లకంది దారుణమైన అన్యాయం చేయకపోతే – డబ్బుందిగా, ఎక్కడైనా ఏడవ లేకపోయావా?! అని డాక్టరు అడిగేసింది సుబ్బారావుని.

"అబద్ధమాడుతున్నారేమో అనుకున్నానండి" అని బ్రూట్‌లా నవ్వే శాడు సుబ్బారావు.

"మగవాళ్ళ ఆకలి నీకేం తెలుస్తుంది. అన్నట్లుందానవ్వు.

చిట్టెమ్మకు యింటికొచ్చాక ఘోరమైన జ్వరంకాసి, టైఫాయిడ్‌లోకి దింపేసింది.

నడవలో పక్కేసి పడుకో బెట్టారు. జుట్టంతా రాలిపోయింది. దవ డలు లోతుకెళ్ళిపోయాయి. సుబ్బారావునుచూస్తే కెవ్వున కేకేసి ఫిట్టొచ్చి నట్లు పడిపోయేది.

వెంకటలక్ష్మి నరసమ్మ తమ్ముడి కంటె ఎక్కువ కంగారు పడి పోయి చిట్టెమ్మను తిట్టేసేది.

డాక్టరు మాత్రం ప్రత్యేక శ్రద్ధతీసుకుని వచ్చినప్పుడల్లా "ఏం మంచం మహారాణి" అని పలకరించి నవ్వించేది.

ఆ విధంగా చిట్టెమ్మకు మంచం మహారాణి అనే మారు పేరు కూడా వచ్చేసింది.

అందరికీ పైకి వ్యక్తం చేయని అసహ్యం ఏర్పడిపోయింది. అందు వలన సుబ్బారావు రెండురకాలుగా చెడిపోయాడు.

చిట్టెమ్మంటే ద్వేషం ఏర్పడిపోయి పబ్లిగ్గా అడ్డమైన తిరుగుళ్లా ప్రారంభించాడు.

వెంకటలక్ష్మినరసమ్మ దగ్గర డబ్బు గుంజడం వీధిలో ఖర్చు పెట్టడం—ఇదేమంటే అదలా మంచమెక్కి కూర్చుంటే నేనిలా తిరిగితే తిరుగుతాను తప్పొచ్చిందా అని సవాలకు పైసవాలు.

లక్ష్మీనరసమ్మకూడా తమ్ముడిని వెనకేసుకుని ముక్కు పచ్చలారని చిట్టెమ్మను యీసడించి పారేసింది.

పెళ్ళయాక ఒక ఏడాది నరకయాతన పడ్డాక ఓ ముహూర్తాన చిట్టెమ్మ పెద్దమనిషైందని చిమ్మిలి పంచిపెట్టారు.

సుబ్బారావు యింటికి రాగానే వసంతం చల్లారు. సావిట్లో వోమూల పచ్చికొబ్బరాకులతో అల్లిన చాపమీద చిట్టెమ్మను కూర్చోబెట్టి పేరంటాళ్లు పాటలు పాడారు. దీవించారు. ముహూర్తం మంచిదేకాని నూనెలో మొహం చూసుకోవాలి అన్నారు.

చిట్టెమ్మ దాంపత్య జీవితం బ్రహ్మాండంగా వుంటుందన్నారు. మూడు పువ్వులూ ఆరు కాయలుగా సాగుతుందన్నారు, దీర్ఘ సుమంగళిగనే చిట్టెమ్మ జీవితం గడుస్తుందన్నారు.

చిట్టెమ్మకు స్వర్త పెళ్ళికూతురని నలుగురూ యిచ్చిన రూపాయి, అర్ధా, రెళ్లూ, మూళ్ళూ వో పాతిక వరకూ చేరాయి.

ఓ అర్ధరాత్రి మూలన పడుకున్న చిట్టెమ్మను తన్ని ఆ పాతికా పట్టుకుని కాకినాడ పారిపోయాడు సుబ్బారావు.

నాలుగోనాడు కార్యం ముహూర్తం పెట్టించి ఆ కాస్త అయిందని పిడ్రావ(ని లక్ష్మీనరసమ్మ అనుకుంటే, అప్పుడు తొందర పడ్డవాడు యిప్పుడు యింట్లోంచి పారిపోయాడు. వెధవ కళా కళలూ వాడూనూ. రాకేం చస్తాడు అనుకుంది నిబ్బరంగా అప్పగారు.

ఎంతకీ కుర్రాడు కనపడక పోయేసరికి వెంకటలక్ష్మీనరసమ్మ చిట్టెమ్మను నీ మొహానికి కాపరం వోముద్దూ ముచ్చటా వున్నట్లులేదే అని జలకడిగేసింది.

పసుపు రాసుకుని స్నానంచేసి కొత్త చీర కట్టుకొని బొట్టూ కాటుకా

పెట్టుకొని యింట్లో నడయాడుతూంటే శ్రీమహాలక్ష్మీదేవిలా వుందమ్మా పిల్లఅని నలుగురూ అన్నారు.

"దీని మొగుడు దారికొచ్చి దీని కాపరం చక్కబడినప్పుడు గదమ్మా" అని కళ్ళొత్తుకుంది వెంకటలక్ష్మీనరసమ్మ.

చిట్టెమ్మ థర్డుఫారం వరకూ చదివింది. దీనికి చదువెందుకు. ఇదేమన్నా ఉద్యోగాలు చేయాలా ఊళ్ళేలాలా అని మానిపించి యింట్లో కూర్చోపెట్టేశారు.

మొగుడ్నిమించి చదువుకుంటె ఆడది చెప్పినట్టు వినదు అని ఓ రూలు ప్యాస్ చేశారు.

కాని చిట్టెమ్మ యింట్లోకూర్చుని హిందీ పరీక్షలకుకట్టికొన్ని ప్యాసయింది.

ఇంట్లో కూర్చుని పుస్తకాలు తెప్పించుకుని చదివింది:

పత్రికలలో కథలూ నవలలు గట్రా చదివి బోలెడంత లోకజ్ఞానం సంపాదించింది.

అప్పుడామెకు తను మురికి గుంటలో వున్నట్లు తెలిసింది.

తనకు జరిగిన పెళ్ళిలో ఎక్కడా న్యాయం వున్నట్లు ఆ పిల్లకు తోచలేదు. సుబ్బారావు తననెందుకంత నీచంగా హీనంగా చూస్తాడో ఆమెకు అర్థంకాలేదు.

సుబ్బారావు ఆ రోజు రాత్రి ప్రవర్తించినతీరు మహా భయంకరంగా వుంది. చిన్నదానిపట్ల అంత ఘోరంగా నీచంగా ప్రవర్తిస్తూంటే వూరుకున్న పెద్దవాళ్ళంటే ఆమెకు అజ్ఞాతంగా ఏహ్యాభావం ఏర్పడిపోయింది.

ఒక్క డాక్టరుతప్ప ఆ పిల్లయెడ కరుణ చూపినవారులేరు.

స్త్రీకి సాంఘిక న్యాయం జరిగే అవకాశంలేని కూపస్థ మండూకాల మధ్య తను జీవిస్తున్నాననే సంగతి ఆమెకు స్పష్టమయిపోయింది.

అల్లిక పనులు, కుట్టడం, వంటలు అన్నీ నేరుపుగా అభ్యసించింది. చాలా పొందిక, నెమ్మది, ఏపని చేసినా తీర్చి దిద్దినట్లు చేయడం ఆమెకు అలవాటు — మంచి మన్నన, మర్యాద, మాటపొందిక అలవడ్డాయి.

చిట్టెమ్మ షోడశ కళాప్రపూర్ణ అయేసరికి దేవదానవులు పోట్లాడుకుందుకు కారణమయిన అమృతభాండంలా వుంది కాని మొగుడు మంటల్లోకి తోసేసిన కమలిన కమలంలా లేదు.

అయితే చిట్టెమ్మకు ఊళ్లో అంతా "మొగుడు విడిచేసిన ముండ" అని నామకణం చేసారు. ఎవరో కాదు అస్తమానం కన్నతల్లే ఆమాట అంటూ విసుక్కునేది. అది ప్రచారంలో కొచ్చేసింది. తను పుట్టి పెరిగిన వాతావరణం తన చుట్టూ వుచ్చులల్లు తున్నట్లు వుండేది.

ఓ మాటు ఎవరో దొంగ యింట్లో పడ్డ అలికిడయింది, వాడు గోడ దూకి పారిపోయాడు. జనం గోడదూకి పారిపోలేదు, అది అంతే – అని చిత్రంగా చెప్పకున్నారు. వాడు దొంగ కాదని చిట్టెమ్మ చిత్రచోరుడని పుకారు పుట్టించారు

ఆ రోజునుంచి పూజ్యతకూడా నశించి, యింట్లో దెబ్బలు ఆరంభమయాయి చిట్టెమ్మకు.తల్లి చెంబుతో మొత్తేది. నీళ్ళు తెచ్చి మీద దిమ్మరించేసేది. ఓ మంచి గుడ్డకట్టుకోనిచ్చేది కాదు. తల్లో పూలు పెట్టుకోనిచ్చేది కాదు. రుసరుస లాడేది విసవిస లాడేది. నిక్షేపంలాటి నాతమ్ముడిష్ట

మ్రింగేవే అని తిట్టేది. జిడ్డు మొహం! చవిటిగాళ్ళ పెద్దమ్మ. నీ మొహం చూస్తే అన్నంకూడా పుట్టదు, అని దులిపిపారేసేది.

ఎవరితో మాట్లాడినా తప్పు పట్టేది. పాలవాడితో, పెరుగువాడితో. తెలిసినవాళ్ళతో మాట్లాడినా తప్పట్టేది.

చిట్టెమ్మకు ఓరిమికూడా నశించిపోయే పరిస్థితి ఏర్పడింది. అప్పుడామెకు సుబ్బారావు గుర్తుకొచ్చాడు. మావయ్యొస్తే తప్ప తనకీ గండాలు తప్పవని తెల్సిపోయింది, దుర్మార్గుడవు గాక అతడే ఆపద్బాంధవుడు. ఆడదానికి మొగుడే గొడుగు నీడ.

అప్పుడామెకు జ్ఞానోదయమైంది. తన మొగుడ్ని తానే వెతుక్కోవాలి .వెతుక్కొని ఎలాగో వాడి పంచకు చేరుకోవాలి. తనను మొగుడు విడిచేసిన ముండ అనే యీ బిరుదు తొలిగి పోవాలి. కళ్లు తుడుచుకుంటూ ఢిల్లీలో రేవతికి పెద్ద ఉత్తరం వ్రాసింది. బావగారికి తన జీవితకథను చెప్పి ఎలాగేనా తనమొగుడ్ని వెతికించి పెట్టమని అని తన చేతిగాజుల జత తీసి దానికే ఉత్తరాన్ని కట్టి పార్సెలుచేసి పంపింది.

"గాజుల జతనేం చేశావే దెయ్యమా" అని లక్ష్మీనరసమ్మ జుట్టు పట్టుకు గుంజి గోడకేసి కొట్టింది చిట్టెమ్మ తలను.

తన మొగుడ్ని కనక వెతికించి పెట్టకపోతే ఛస్తానని కూర్చుంది మొండిపట్టు పట్టి.

దానికోసం ఒక గాజు ఒక ఉంగరం తీసి యిచ్చింది. ఇప్పుడు చేతిని ఒకటే బంగారపు గాజు – మిగతావన్నీ రబ్బరు గాజులు.

దీనికి మొగుడి పిచ్చి పట్టుకుందర్రో అని అంతే అనుకున్నారు. చీకటి పడగానే గదుల్లో దూరి తలుపులేసుకునే ఆడాళ్లూ మగాళ్లూ,దజప్ల

మీద పిల్లలను కంటున్న తల్లులూ. అంతా చిట్టెమ్మకు పదపిచ్చి అని తీర్మానించారు.

మదనో మన్మధో మారో!

తామెవరిజోలికీ మన్మథుడు రానట్లే వచ్చినా డవున్ డవున్ అన్నట్లు మాట్లాడేరు.

మంచం మహారాణికి మదపిచ్చి పట్టుకుందని అంతా వేళాకోళా లాడారు.

క్రమంగా రోజుకు రెండుమాట్లు ఫిట్టొచ్చి పడిపోయేది చిట్టెమ్మ. అప్పుడు దాని ఉధృతం చూసి తీరాలి; పడుపుహోరు, కాళ్ళు నేలకేసి బాదుకోవడం మనిషి ధనుస్సులా లేచిపోవడం.

ముగ్గురు నలుగురు మొగాళ్ళు మీదబడి నేలకు అదిమి పట్టుకుంటే ఒక్క కుదుపుకి నలుగురూ నాలుగు మూలల కిసిరేసినట్లు పడిపోయి లేవ లేకపోయారు.

వెంకట లక్ష్మీనరసమ్మ ఓ మాటు పడి పట్టుకోబోతే తన్నిన తన్నుకు గోడకు వెళ్ళి బంతిలా కొట్టుకుని నేలమీద కుప్పలా పడి కూలి పోయింది.

కామినీ పిశాచం, దయ్యం పట్టుకుందని తేల్చేశారు.

ధూపాలు, దీపాలు, నైవేద్యాలు. పూజలు, మంత్రాలు, కోళ్ళని కొయ్యడాలు అన్నీ ప్రారంభమయ్యాయి.

నాలిక్కరుచుకునేది నోరంతా నెత్తురయి పోయేది. కాళ్ళు కొట్టు కోవడం వలన ఏకీలుకా కీలు నలుపు పెట్టి వొళ్ళంతా పచ్చి పుండ యేది. బిందెల్తో నీళ్ళు దిమ్మరించేసేవారు.

మనిషిలో నేవళీకం నాగరికం పోయి పిచ్చి చూపులు వెర్రి వాల కం దిగడ్డది.

డాక్టర్ను తీసుకొచ్చారు కొందరు.

డాక్టరు యింజక్షనిచ్చింది. మాత్రలిచ్చింది. మొగుడ్ని వెంటనే పతికి తెప్పించండి మంచం మహారాణికి అని చెప్పి నవ్వుకుంటూ వెళ్ళి పోయింది.

ఇప్పుడా — ఇంకా నయం!

పంచపాండవుల్ని తీసుకొచ్చినా చిట్టెమ్మకి ఫిట్టొచ్చిందంటే మచ్చుకి మందెలోకి కనపడరు.

సుబ్బారావ్ తిరిగొచ్చినట్లాయెనా ఇది నిజంగా కార్యం చేయవలసిన టైము.

ఆరోజు పావంచాలమీద అప్పతో దెబ్బలాడి గదిలో దూరడంకాదు —యిప్పుడు ఏలుకోవాలి చిట్టెమ్మను.

"ఏలుకో నాస్వామి నా తమి దీర్చేటందుకు—" అని నలుగురూ నాలుగురకాలుగా చెప్పుకున్నారు.

సుబ్బారావు నిజంగా తిరిగొస్తే వెంకటేశ్వరస్వామికి చిట్టెమ్మ తల నీలాలు యిప్పించేస్తానని దంపతులిద్దరూ కొంగు కొంగు ముడివేసు కుని మెట్లెక్కి నీ దర్శనానికి వస్తారని మొక్కుకుంది లక్ష్మీనరసమ్మ.

పిలిస్తే పలికే దైవం వెంకటలక్ష్మీనరసమ్మ పిలిస్తే పలకడా?

మొక్కుకున్న మూడోనాటికల్లా ఢిల్లీనుంచి రేవతి మొగుడు పెద్ద ఉత్తరం రాశాడు—"కనుగొంటినీ, శ్రీరామునీనేడు...." అన్నట్లుందా ఉత్తరం.

ఉత్తరాన్ని పూజా మంటపంలో పెట్టి కూతురుచేత పుష్పాక్షతలు జల్లించింది.

రేవతి ఓ ఉత్తరం వ్రాసింది. రేవతి మొగుడో ఉత్తరం వ్రాశాడు ఆ రెండు ఉత్తరాలు చిట్టెమ్మ పంపిన గాజుల జత తిరిగొచ్చాయి.

ఆ ఉత్తరాల సారాంశం —— జరిగిన కథ మొత్తం యిది.

కామేశ్వరి ఉరఫ్ చిట్టెమ్మ లేక మంచం మహారాణీ మొగుడు బొంబాయిలో వున్నాడ్ట —— కనిపించాడు.

రాజకుమారుళ్ళా వున్నాడ్ట.

కుచ్చుటోపీ, ధగధగ మెరిసిపోయే యూనిఫారమ్‌లో, సకల సామ్రాజ్య చక్రవర్తిలా వుంటాడ్ట, నడుస్తూంటేనూ మెట్లెక్కి దిగుతూంటేనూ.

అతనికోసం ఎంతమందో నిరీక్షిస్తారట——

పెద్ద హోటల్లో బేరరు.

ఇంగ్లీషు, మరాఠీ, హిందీ అనర్గళంగా మాట్లాడేస్తున్నాడ్ట, నెలకు వందన్నరో, రెండు వందలో అంతా సేవింగేనట. లెఫ్ట్ వోవర్సు —— వెన్నా పాలు రొట్టెలు తిని మన్మథుళ్లా తయారయేడ్ట. నడుస్తూంటే భూమి దద్దరిల్లుతుందట.

స్మగ్లింగు విద్యకూడా తెల్సట. రేస్‌కోర్సులో ఏ గుఱ్ఱాలమీద కాయొచ్చో చెప్పగల్గుతాడ్ట.

సినిమాల్లో ఎక్స్ట్రావేషాలేసే వో మరాఠీదాన్తో చిన్న స్నేహం కలిపేడ్ట. ఒక గుజరాతీసేఠ్ అవుట్‌హావుస్‌లో యిద్దరూ కలిసి అన్‌యోన్యమ్‌గా జీవిస్తున్నారట.

రేవతి మావయ్యా అని పిల్చి పలకరించి తన మొగుడ్ని పరిచయం చేస్తే ఎంతో మర్యాద పొలకబోస్తూ మాట్లాడేట్ట.

రేవతికి అపాలజీ యిచ్చేట్ట. ఆవేళ చిట్టెమ్మ అనుకుని రేవతి కాలు గోకేట్ట గాని అది యాక్సిడెంటేగాని ఇన్సిడెంటుకాదు అందుకు క్షమించండని యిద్దర్నీ అభ్యర్థించేట్ట.

వీడా సుబ్బారావు కాదనిపించింది రేవతి దంపతులకు. వాడెక్కడ? వీడెక్కడ?

అప్పుడు రేవతి మొగుడు చిట్టెమ్మ గాజులజతను చూపించి పరిస్థితంతా వివరించి ఏం చేయదల్చుకున్నావని నిలదీసి అడిగేరట:

హూ .ఈజ్ దట్ చిట్టెమ్మా?

హో! మైగాడ్—దట్ డాటర్ ఆఫ్ లక్ష్మీనరసమ్మా అన్నట్లు మాట్లాడలేదట.

వైడోంట్యూ మేరీహర్ ఎగైన్ అన్నట్లు మాట్లాడుతాడేమో అనుకున్న రేవతి మొగుడికి ఆశ్చర్యంవేసిందిట.

చిట్టెమ్మను తలుచుకుంటె తన గుండె ద్రవించుకు పోతుందన్నాడు. తను ప్రయోజకుడు, కాందే ఆంధ్రదేశం నడిబొడ్డుమీద అడుగు పెటదల్చుకోలేదని అది తన ప్రతిజ్ఞ అని నచ్చ చెప్పాడు.

డిగ్నిటీ ఆఫ్ లేబరు గురించీ బాల్య వివాహాలు తప్పనీ మాట్లాడేడు.

మేన కోడలుకి మేనకోడలు మొగుడికి తనే ఏక టేబిల్‌మీద సర్వ్‌చేసి, పట్టుకు వొదలకుండా గొప్ప మర్యాదచేసేడు. పిక్చర్స్‌కి వెళ్ళేరు. టాక్సీలో బొంబాయంతా తిరిగేరు.

సుబ్బారావు అన్న పేరు బాగోలేదని "రావ్" అనో "రవే" అనో పేరు మార్చుకున్నాడట.

తను వచ్చి చిట్టెమ్మను బొంబాయి తీసుకెళ్ళి కాపురం పెట్టేస్తానని చేతిలో చేయేసి చెప్పాడట.

ఉత్తరం రాస్తాననీ, ఎయిర్ పార్సెల్లో ఒక రిష్టువాచీ, చీరె, బ్లవుజు పీసూ బొంబాయి పేషన్వి పంపబోతున్నట్లు ఆ చిట్టెమ్మ హృదయాధిష్టాన చక్రవర్తి మాటయిచ్చేడట.

ఆ ప్రకారంగానే వారం తిరక్కుండా చిట్టెమ్మకు లవ్ లెటరూ ఎయిర్ పార్సెల్లో చెప్పిన మూడు వస్తువులూ వచ్చాయి,

* * * * *

సుబ్బారావు కొత్తగా పెంచిన మీసాలి.్న చూసి ముందస్తిగా భయపడినది వెంకటలక్ష్మీనరసమ్మే! మనవాడే మనవాడే, మనవాడేనేఅని సర్దుకుంది.

అవి బొంబాయి మీసాలు అనుకుంది.

చిట్టెమ్మను చూసి నవ్వేడు.

తలవొంచుకు బొమ్మలా నించుంది.

లక్షీనరసమ్మ చూస్తూండగానే చెయ్యిచ్చుకు లాగాడు చిట్టెమ్మను నిర్భయంగా.

బొంబాయి కుర్రాడు మంచి కాకమీదున్నాడు అనుకుంది. తన వస్తువు తనేంచేసుకుంటే మాత్రం అడగడానికి మన మెవరంవో అయ్యచేతుల్లో పెట్టాక అని సర్దుకుంది.

చీకటి పడకుండానే యిటూ అటూ తిరుగుతూండే చిట్టెమ్మను గోడదగ్గర తలుపుదగ్గర కాస్త అటకాయించి చూశాడు.

ఎప్పటికీ చీకటిపడకుండా వుంది.

ఊళ్ళోవాళ్ళంతా వచ్చి 'బలేవాడివయ్యా! హడలకొట్టి చంపేశావుఁ పాపం చిన్నపిల్ల....చిట్టెమ్మ నీ కోసం చిక్కి శల్య మైందనుకో – అంత లాగున చెప్పకుండా చెయ్యకుండా వెళ్ళి పోవడమేనా? బాగుందయ్యా వరస' బాగుంది! ఏం తెచ్చావ్ పిల్లకు బొంబాయి నుంచీ? అయితే మా చిట్టెమ్మబొంబాయి వెళ్తుందన్న మాట. బొంబాయొస్తే మీ యింట్లోవుం డొచ్చు. ఇంకేఁ నిక్షేపంలా బొంబాయిలో మనవాళ్ళున్నారని చెప్పుకోవచ్చు. ఆ రోడ్లూ ఆ బిల్డింగులూ కార్లూ అబ్బోస్ – అవన్నీ నీకు కొట్టిన పిండే ననుకుంటా. మరాఠీ, హిందీ ఇంగ్లీష్, గుజరాతీ అబ్బో అన్నోటి భాషలు తెలుసన్నమాట! ఏవిటోకాలు కదిపి బైటపెడితేగాని తెలుగువాడి ప్రతిభ బైటపడదు. మరిన్నాళ్లూ సంపాదించినది – ఏవిటి బాగా మూట కట్టావా? కట్టి వుంటావులే – బంగారపు కణికెలూ గట్రా తెస్తావా? బ్యాంక్‌పాసు బుక్ పట్టుగొచ్చావా? బ్యాంకుప్యాసుబుక్కే తెస్తావు. మేఁ వెరగమా? ఏదో మనవాడు పైకొచ్చేడంటే కళ్ళతో చూసి ఆనందిద్దావని వచ్చాం. చూశాం, సంతోషంగా వుంది నాయనా! అమ్మా చిట్టెమ్మా, నువ్ సతీ సావిత్రిలా సీతమ్మతల్లిలా, మరేవోనూ మునిపత్నిలా యిన్నాళ్ళూ నీభర్త కోసం నోముల్ నోచేవు, పూజల్చేసేవు, వ్రతాలు పట్టేవు, అల్ల వెంకటేశ్వరు డిన్నాళ్ళ కిన్నాళ్ళ నీ మీద కరుణించేడు. నీ భర్తను బొంబాయి నుంచి సరాసరి నీ కాళ్ళదగ్గరకు నడిపించుకొచ్చేడు. ఆ దేవుడే నిన్ను చల్లని కళ్ళ జూసేడు. వెంకట లక్షీనరసమ్మ తల్లీ! ఇదంతా నీ భక్తి వల్లేననుకో–నీ కూతురి పాతివ్రత్య మహాత్యం వల్లనైతేనేమి నీ భక్తి బరువువల్లనైతేనేమి పిల్ల కాపరం ఇన్నాళ్ళకు చక్కబడ్డది. ఓం శాంతి శ్శాంతి! అని వచ్చిన వాళ్ళు నాలుగు మంచి మాట్లాడి వెళ్ళిపోయారు.

వర్షం కురిసి వెలిసినట్లయింది.

ఆ రాత్రి (అంటే రెండవసారి మొదటిరాత్రి) చిట్టెమ్మ బొంబాయి చీరకట్టుకుని రిస్టువాచీ పెట్టుకుని చిలకలా ముస్తాబయి వయ్యారి నడకలతో బంగారు మొలకలా వచ్చింది. మన మీసాల సుబ్బారావు మీదకెత్తేసుకుని గుండెలకు హత్తేసుకుని ఆమెకు ఊపిరిసలపకుండా చేశాడు. అవి ముద్దులు కావు, అవి కౌగిళ్ళు కావు - ఒకటే ప్రేమ ప్రవాహం వరదలు కట్టి పారింది. వారల కేళీ విభవమ్ము పట్టదుగదా, రామా జగన్మోహనా! కాని అంతలో ఏమయిందో ఏవిటో - ఓ రాత్రి యింత బొంబాయి మీసాల వాడూ! కెవ్వుమని కేక పెట్టాడు.

మీసాలుచ్చుకు గుంజినట్లు గిలగిల లాడేడు.

బొంబాయి చీర ఓచోట వుంది. పిల్లోచోట మనవాడోచోట. ఫిట్టొచ్చింది కాబోలు, కొయ్యలా బిగుసుకు పోయింది

ఆ కిక్‌కి మనవాడి మొహం చట్నీచట్నీ అయిపోయింది. మంచం మీంచి పడ్డంవల్ల నడ్డి విరిగింది.

తలుపుతీస్తే- వెంకటలక్ష్మీనరసమ్మొచ్చి చిట్టెమ్మ మీద దుప్పటీ కప్పి అల్లుడి సాయంతో పిల్లను కంట్రోలు చేసేసరికి మూడు కొట్టింది. ఫరవాలేదు నాయనా అన్నా బొంబాయి మీసాల సుబ్బారావు వినకుండా హాల్లో వేసుకున్నాడుపక్క.

చిట్టెమ్మకు తెలివొచ్చేసరికి తన వొంటిమీద దుప్పటీ కప్పివుంది. "దాహం——దాహం! అని అరిచింది. ఇన్ని నీళ్ళ చుక్కలు గ్లూకోజు కలిపినవి తెచ్చిపోసి వెంకటేశ్వరస్వామి ఫొటో దగ్గర సాష్టాంగపడి తండ్రీ అపచారం జరిగిపోయింది. కొండకు తీసుకొచ్చి మొక్కు చెల్లిస్తానన్నాను, కానా —— ఇంతలో బొంబాయి పిల్లాడు తొందరపెట్టాడు. క్షమించు! అని నడవలో మీసాల సుబ్బారావుకి వినపడేలా లెంపలేసుకుంది.

సుబ్బారావు "టు—బి—నాట్---టు—బి అన్నట్లు కొచ్చినాఫ్ హేమ్లెట్‌లో పడ్డాడు. టు గో ఎలోన్, ఆర్ టు గో విత్ చిట్టెమ్మా!

చిట్టెమ్మను తీసుకుని తిరపతి వెళ్ళమని వెంకటలక్ష్మీనరసమ్మ ఒకటేపోరు.

మీసాల సుబ్బారావు జాతకంలో పోరు లాభము పొందు నష్టము అన్నట్లుంది.

తిరపతి వెళ్ళక తప్పలేదు. గుండుచేయించుకు రాక తప్పలేదు.

వెంకటలక్ష్మీనరసమ్మ మొక్కు పుణ్యమా అని చిట్టెమ్మకూడా జుట్టు ఇవ్వాల్సి వచ్చింది.

జుట్టిచ్చాక యీకలు పీకేసిన కోడిలా ఓ పక్కకు ఒరిగిపోయిన పాకలా, కూలిపోతున్న కొంపలా మాంసపు ముద్దలా అగపడేది చిట్టెమ్మ.

మీసాల సుబ్బారావు చూపులు యీ కోడి ఎన్నిపవున్లు అన్నట్లు దీని వంట్లో ఎన్ని పవున్లు మాంసం వుంది అని తినబోతూ రుచడిగినట్లుండేది.

ఆర్నెల్లు దీన్ని మేపితే దీని బుగ్గలు ఆపిల్‌పళ్ళు మనిషి డన్లప్పిల్లోగాను వొళ్ళు మఖ్‌మల్ తానుగాను, వాలుచూపులు మరుని కాటార్లుగానూ అవొచ్చు. పల్లెటూరి తోటలో కోసుకొచ్చిన జాంపండులా వుంటుంది. అప్పటికి హెయిర్ స్టెయిలు మార్పిస్తే దీనినోట్లో నాలుగింగ్లీషు ముక్కలు నాలుగు మరాఠీ ముక్కలు రెండు హిందీ పలుకులు పడేస్తే ముద్దు ముద్దుగా మాట్లాడిస్తే యీ జిలిబిలి పలుకుల చిలకతో కానేస్తే బొంబాయంతా కానేయొచ్చు!

అబ్బనాకారపు పిల్ల, కార్లు పట్టణాలు రైళ్ళు మోటార్లు విమానాలు ఎరగనిది. కల్లా కపటం తెలియనిది. కన్నీరే కడవ నింపిత గదరా

అన్నట్లు యిన్ని రోజులూ జీవితం వెళ్ళబుచ్చినది, తనవాడని తన మొగుడని తనకన్యాయం చేయడనీ, తన పాలిటి ఆపద్బాంధవుడని నమ్మి ఒంటరిగా వెంట బయల్దేరింది, వెంకట లక్ష్మీనరసమ్మ. పిల్ల జాగర్త నాయనా! అని కళ్ళనీళ్ళు పెట్టుకుంది.

*　*　*　*　*

రైల్లోనే దాని మంగళసూత్రాలు బేక్ పాకెట్లో పెట్టేసి చిట్టెమ్మను తీసుకెళ్ళి బొంబాయి బజార్లో మిఠాయి దుకాణం పెట్టాడు మీసాల సుబ్బారావు.

ఆ రోజు మళ్ళీ ఫిట్టొచ్చింది. చిట్టెమ్మ యిచ్చిన కిక్‌కి బెడ్‌మీద నుంచి ఒకరు సీలింగుకి వెళ్ళి కొట్టుకుంటే రెండవవారు కప్ బోర్డులోకి వెళ్ళిపోయారు.

ఇంట్లోంచి పారిపోయి రైలెక్కి కాకినాడొచ్చేసరికి రిస్టువాచీ ఒక గాజూ అమ్మేసింది.

ఇంకో ఉంగరం ఇంకో గాజు వుండాలి.

అవును ఆ ఇంకో ఉంగరం — ఇంకో గాజు కథ తరువాయి

ఉంకో సుబ్బారావుకూడా వూడి పడ్డాడు. ఆ సుబ్బారావుకి బొంబాయి మీసాలులేవు. మామూలు మన అనుమానపు పురుషుడే —

గదిలోపెట్టి గొడ్డును బాదినట్లు బాదాడు చిట్టెమ్మను — వాడెవడో — వాడ్తో బొంబాయి వెళ్తావా?" అని

వెంకటలక్ష్మీ నరసమ్మ కాళ్ళమీద పడింది. తనకూతురేపాపం ఎరగదని మొత్తుకుంది. ఆ ఢిల్లీముండ వాడ్నెవడ్నో బొంబాయిలో చూసి

మనవాడనుకుని లాక్కొచ్చింది. వాడూ వాడి మీసాలు వాడెక్కడ — జగచ్ఛత్రీ ముండాకొడుకు — తిరపతెళ్ళి జుట్టుకూడా తీయించుకున్నాడు. అయినా ఏవీ జరిగుండదు — పిల్లకు ఫిట్లు, తంతే మనిషి ఆకాశమంత ఎత్తువెళ్ళి క్రింద పడాల్సిందే. నిజం! ఏలుకుంటావో మానుకుంటావో ఆ పైన నీ యిష్టం!

యతో ధర్మ స్తతో జయః పిల్లను నీళ్ళనాడు తన్ని డబ్బులు లాక్కుని పారిపోయావిదేవన్నా బావుందీ? ఎందుకొచ్చిన రొష్టు! మళ్ళీ తిరపతెళ్ళిరండి; ఆ పుష్కరిణిలో మునిగారంటే, సర్వ పాప వినాశనం — కళ్ళు మూసుకుని మున్మల్సి కాపాడు — రక్షించు తండ్రీ అని మొక్కుకోండి: అతను కటాక్షిస్తాడు. ఈ శరీరంతో చేసినదేదీ పాపం కాదు, పుణ్యంకాదు. మనసు పరిశుద్ధంగా వుందా, లేదా అది చూసుకోవాలి.

పిల్లకేం పిల్ల నిక్షేపంలా బంగారు బొమ్మలా తిరిగొచ్చింది. కుక్క ముట్టుకుందని బంగారాన్ని పారేసుకుంటామా నాయనా అని సుభాషితాలన్నీ చెప్పి నిజం సుబ్బారావుని ఏలుకోమని కూతుర్ని కరుణించమని ప్రాధేయ పడింది.

చిట్టెమ్మ కథ వూరంతా నిప్పురాజుకున్నట్లు రాజుకు పోయింది: పాతమొగుడుపోయి కొత్తమొగుడొచ్చాడని వూరూ వాడా వింతవింతగా చెప్పుకున్నారు.

ఆ ఢిల్లీ ముండకి, యిదేవిటే నీ మొహం తగలెయ్యా - పిల్లకి ఉపకారం చెయ్యమంటే మరెవడ్నో తెచ్చి మీసాల పులికి పిల్లనంట గట్టావూ( అని గట్టిగా రాస్తే జవాబొచ్చింది. వాడెవరోకాదు వాడూ మేనత్త కొడుకే-తను ఒక్కసారే చూసింది మొన్నొచ్చినప్పుడు. తన భర్త చూడలేదు కనుక పొరపాటయి పోయింది. దగ్గర చుట్టాల్లో పోలిక ఉం

డవా - వుంటే బొంబాయి పింతల్లికొడుకు, ఆ దర్జా, ఆ ఠీవి, ఆ నడక చూసి కామోసనుకున్నాం. సో వెరీ సారీ అని వ్రాశారు.

మరి చిట్టెమ్మ చీకటి కథ అడక్కండి బాబూ! నిజం సుబ్బారావు- ఏ సుబ్బారావు? సుందరరావుగారి సుశీలో, శీలో, శాంతో. వాంతో దాన్తో చిన్న దోస్తీ కట్టి దెబ్బలు తిన్న రసిక శిఖామణి, అల్లప్పుడు పన్నెం డేళ్ళ పిల్లను పెళ్ళాడి పెళ్ళిలో పేరంటాళ్ళమీదకు పూలచెండ్లు విసిరిన సుబ్బారావు. ఆడాళ్ళకేసి తినేసేట్లు చూసే సుబ్బారావు, రేవతి కాలు గోకి చావు తప్పి కన్ను లొట్టపోయినంతెతే రాత్రికి రాత్రి కార్యం చేయమని పట్టుబట్టి పసిపిల్లను సిగ్గులేకుండా పాడుచేసి ప్రాణంమీదకు తెచ్చిన సుబ్బా రావు పెద్దమనిషయిన పిల్లచేతిలో పెట్టిన రూపాయలు తన్ని లాక్కుని మద్రాసెళ్ళి సినిమాలచుట్టూ తిరిగిన సుబ్బారావు—

చిట్టెమ్మను తీసుకెళ్ళి కాకినాడలో కాపరం పెట్టాడు.

ఓ పువ్వూ పండూ కాయ ముద్దూ ముచ్చటా దేనికీ నోచుకోని చిట్టెమ్మ రోజూ వొళ్లు చీరుకుపోయి స్పృహ తప్పేలా దెబ్బలు తింటూండేది. నానా దుర్భాషలూ ఆడేవాడు. తాగొచ్చేవాడు తాగొచ్చి చిట్టెమ్మను కాళ్ళకింద తొక్కి నలిపేసేవాడు. తిండి తిననిచ్చేవాడు కాదు. కూర్చో నిచ్చేవాడుకాదు. పడుకోనిచ్చేవాడుకాదు.

చిట్టెమ్మ నిజంసుబ్బారావు కాపరానికి భయపడిపోయి పారిపోయింది. పుట్టింటికి. మళ్ళీ గుమ్మం తొక్కావంటే చెక్కపేడు మొహం మీద విసిరేస్తానంది తల్లి.

"పో ముండా-మొగుడిదగ్గరకు. నీ గుడిసేటి కాపరం చక్కచేస్తే మళ్ళీ పారిపోయొస్తావా" అని గసిరేసింది.

నూరేళ్ళ చీకటిని మ్రింగి కూర్చుని గడప మీద తలకొట్టుకుంటూ ఏడుస్తున్న చిట్టెమ్మకు యింతా చేసి యిరవైయేళ్లు నిండలేదు.

వెంకటలక్ష్మీనగసమ్మ పిల్లను ఒంటెద్దు బండీలో వేసుకుని తమ్ముడి దగ్గరకు తీసుకెళ్ళి "నీవస్తువనీది. నీ యిష్టం—ఏవన్నా చేసుకో ఏలుకున్నావు, అదే పదివేలు" అని డైలాగులు చెప్పింది.

ఆడదానికి ఆఖరి అవమానం చేసేడు సుబ్బారావు:

స్నేహితుల్ని తెచ్చి యింటో పెట్టి తను బైట తిరిగే వాడు.

కోనసీమలో పెద్దాళ్లు అమ్మమ్మలు రాసిపోయిన భూములన్నీ కరిగించి జూదాలూ, త్రాగుడూ, ఆడాళ్ళనూ మరిగి పెళ్ళాన్ని బాగా రోస్టుగా వేపుకుతినసాగాడు. తన శరీరం పుచ్చిపోయింది. తన సంపాదనంతా ఆ పిల్లకు వప్పజెప్పి – డాక్టరు దగ్గరకు తీసికెళ్ళి చిట్టెమ్మను అవహేళన చేశాడు. అదీ భరించింది.

తన స్నేహితులు పెద్దమనుషులన్నాడు. అంగన నమ్మరాదన్నాడు. తన పెళ్ళాం బుద్ధులు మంచివికావని ప్రచారంపెట్టాడు? చిట్టెమ్మ ఏడ్చింది బ్రతిమాలుకుంది. స్నేహితుల్ని యింటికి తేవద్దని ప్రాధేయపడింది.

బొంబాయిలో మిఠాయి దుకాణంపెట్టిన దానివి నీకు లెక్కేమిటి?

నువ్వు తక్కువ దానివి కాదు. పాతివ్రత్యం కబుర్లు చెప్పబోకు అని వురిమాడు.

చిట్టెమ్మకు అంతాచీకటి.... ఈ చీకట్లలో తాను మిరిమిట్లు గొలిపే కాంతిపుంజంలా ఎలిగి పైకెళ్ళిపోవాలి. సేఫ్! సేఫర్! సేఫెస్టు!

గదితలుపేసుకొని కిరసనాయిలుపోసి ముట్టించుకుంది.

సుబ్బారావు ఫ్రెండ్సు పేకాడుతున్నారు. పడగ్గదిలో ఏదో రోస్టు బాగా కాల్తుందిలే అనుకున్నారు. సుబ్బారావు ఎవతో శీలో, శాంతో. వాంతో, దానింట్లో తొంగున్నాడు. అప్పుడు విశ్వామిత్రుడ్లా వచ్చేడు, రవణ. రవణగాడు రేవతికి తమ్ముడు, అక్కా! అక్కా! అంటూ వచ్చి

పడగ్గదిలో పేకాట మిత్రుల్ని చూసేడు. కళ్ళు బైర్లు కమ్మాయి. అంతా కలిసి కేకలు బొబ్బలు వస్తున్న కొట్టు గది తలుపులు బ్రద్దలు కొట్టేరు.

అంభ్యులెన్స్ తెచ్చి చిట్టెమ్మను ఆస్పత్రికి చేర్చేరు. అంభ్యులెన్సుకంటె ముందు పోలీసులు మేస్ట్రేట్లు డాక్టర్లు పేషెంటు బెడ్ చుట్టూ మూగేరు.

రవణగాడు చిట్టెక్క: ఎంతకష్టమైనా యింతపన్జేస్తావా? అని వాపోయాడు.

వెంకట నరసమ్మ గుండెలు బాదుకుంది. "అయ్యో నాకూతురా!" అని.

"నోర్మూయ్" అని తల్లిని కసిరింది. డాక్టర్ సగం కాలి పోయిన మనిషికి బాధ తెలియకుండా ఇంజక్షన్లు యిచ్చేడు. పోలీసువారు, మేస్ట్రేట్ "మరణ వాఙ్మూలం" తీసుకుందుకు చెప్పమ్మ ఏం జరిగింది? ఎందుకు వొళ్ళు కాల్చుకున్నావు?"

చిట్టెమ్మ నేను వొళ్ళు కాల్చుకోలేదు. నా భర్త స్నేహితులకి కాఫీ ఫలహారాలు చేద్దామని కుంపటి వెలిగించబోతే యిలా ప్రమాదం జరిగింది

'ప్రమాదం జరిగిందా?' అని తిరిగి తిరిగి రెట్టించారు.

సుబ్బారావు దొంగేడుపులు ఏడుస్తూ అక్కగార్ని కావలించుకు బెంచీమీద కూర్చున్నాడు.

రవణగాడు చాలా ఆశ్చర్యపోయాడు. అక్కఎంత తెలివిగా మాట్లాడుతుంది. చచ్చిపోయేదానికింత తెలివీ–చురుకూ దేవుడెందు కిచ్చినట్లు? పోలీసులు, మేస్ట్రేట్లు తన మొగుడ్నిగురించి ఏమైనా చెబ్తుందేమోనని రాసుకుందామని శతవిధాల ప్రయత్నించారు.

చిట్టెమ్మ, రవణా అంతా సరిగ్గా రాశారా? తప్పులేవన్నా రాసేరా? నాకు చదివి వినిపించు అని తమ్ముడిని అడిగిండ.

రవణగాడు వున్నదున్నట్లు తెచ్చి చదివాడు. అప్పుడుఅందరికేసి చల్లగా సంతోషంగా చూసింది. చూసి–

(నేను నా మొగుడితో కొంచెం మాట్లాడాలి. మమ్మలి మాట్లాడుకో నియ్యరూ ?)

డాక్టరు మరో ఇంజక్షనిచ్చి టైము చూసుకుని వెళ్ళాడు.

పోలీసులు, మేస్ట్రేటు అక్కడ్నుంచి లేచి వెళ్లిపోతూ "బ్రిలి యంట్ గర్ల్" అని కాంప్లిమెంటు పారేశారు.

సుబ్బారావు బిక్కుతూ బిక్కుతూ దెయ్యాన్ని సమీపిస్తున్నట్లు ఝుడిసిపోతూ వచ్చి చిటెమ్మకెదురుగా నిల్చున్నాడు.

చిట్టెమ్మ "మీ మంచం మహారాణీని చూసుకోండి" చూసు కున్నారా!"

తల వూయించాడు దొంగలా.

"వెళ్లండి. వెళ్లి లోకంలో చిటెమ్మ మొగుడ్నని నా పేరు చెప్పు కుని బ్రతకండి," అని ఆపేక్షగా చేత్తో మొగుడిచేతిని రాస్తూ చూపుల తనివైపే నిలిపింది.

ఆ చూపులలా నిలబడి పోయాయి. కొసమాట :

ఈ కథ చదివేక మీకందరీ అనుమానం కలిగినట్లే నాకూ అను మానం కలిగింది. మీసాల సుబ్బారావుతో చిటెమ్మను బొంబాయి పంపించ డం బావులేదని. కాని సోదర సోదరీ మణులారా! రేవతి పొరపడిందో పగదీర్చుకుందో మనకు తెలీదు. రేవతి, రేవతి మొగుడు ఏం గమ్మత్తులు

చేశారో మనకు తెలీదు. రేవతిని, మీసాల సుబ్బారావు అపాలజీ అడిగాడో లేదో తెలీదు. బొంబాయి పిన్నిని , వెంకటలక్ష్మీనరసమ్మ గుర్తుకు తెచ్చుకుందో లేదో తెలీదు. అసలు వెంకటలక్ష్మీనరసమ్మకు మీసాల సుబ్బారావు నిజం సుబ్బారావు కాడని తెలిసే పిల్లను వొదుల్చుకుందుకు అట్లా చేసిందేమో తెలియదు. తల్లికూడా అలా చేస్తుందా— పసిపిల్ల అని తెలిసీ తలుపు తీసి తమ్ముడ్ని గదిలోకి తోసిన స్త్రీ ఎంతకైనా నడుం కడుతుంది. వెంకటేశ్వరస్వామిని నమ్ముకుంది. అతడు తెచ్చి యిచ్చిన అల్లుడు మీసాల సుబ్బారావును కాదంటే కళ్ళుపోతాయని, దేవుడు నమ్మకంమీద పిల్లను ఏట్లోకి తోసేసింది. దైవమిచ్చిన భర్తను కాదంటే బెడిసికొడుతుంది.

చిట్టెమ్మ కథ లేశమైనా వెలుగుకిరణం చొరని చీకటి కథ, ఆ మీసాల సుబ్బారావు దూరపు చుట్టానికి ఏవిటి లాభం? బొంబాయిలో మిఠాయిదుకాణం పెట్టొచ్చు. పల్లెటూరి జాంపండుతో ఆడుకోడానికెవరికైనా సరదాయేకదా! యాజ్ ఎండ్స్-కొసలు తప్పు అల్లిక పడ్డాయేమోనానిపిస్తుంది. కానివ్వండి-ఏదిఏమైనా చిట్టెమ్మ మంచం మహారాణీ అన్నది ఖాయం

ఒక వేళ మీసాల సుబ్బారావు బొంబాయి తీసుకెళ్ళక పోయినా, నిజం సుబ్బారావు చేతిలో చిట్టెమ్మ జీవితకుసుమం మాడి మసి బొగ్గు కావలసినదే( – ఫ్యూడలిజం ఆఖరి దశలో మోహ మద మాత్సర్యాల పూర్ణ స్వరూపం సుబ్బారావు. ఈకథలో సుబ్బారావులాటివాళ్ళంటే నాకు గిట్టదు! ఈ వైవాహిక వ్యవస్థ పూర్తిగా మారాలి. పెళ్ళిలో ఘోరంగా మోసగింపబడేది స్త్రీ. చిట్టెమ్మలాటి పాతికేళ్ళకూడా నిండని ఆడదాని బ్రతుకు వెలుగుకిరణం సోకని చీకటి గది. అలా కాల్చుకు చచ్చిపోకపోతే మంచం మహారాణీ అవదు.

నేను చిట్టెమ్మను పాతికేళ్ళు నిండని పడుచును ఏ రమణాశ్రమా

నికో సత్యసాయిబాబా దగ్గరకో. బృందావనమో పంపించలేను. మొగుడొ్న్ని దిలేసి ఏ మిషను కుట్టుమనిషిగానో, పంతులమ్మ గానో, తన్నబతుకుకాక అరువుబ్రతుకు బ్రతికే పాత్రగా చిత్రంచలేను. నిజం సుబ్బారావూ మీసాల సుబ్బారావూచిట్టెమ్మ జీవితంలో తట స్తపడకపోతే-(అంటే రెం డవమారు) చిట్టెమ్మ జీవితం కుక్కలు చింపిన వి స్తరవుతుంది. ఊరు ఊరంతా చిట్టెమ్మను పరాయివాడి పరుపులా వాడుకోవచ్చు. అంత అమా యకురాలి కా శిక్ష తగదు.

అన్నలారా! అక్కలారా! కథలో నాకు చెప్పడం చాతకాని సంగ తులన్నీ మీముందు వెళ్ళబోసుకున్నాను. కాని ఒక్కమాట—'పెళ్ళి' చుట్టూవున్న సాంఘిక వ్యవస్థ, బాగా కుళ్ళిపోయి చెడ్డ కంపు కొడు తోంది. కులాలూ డబ్బు విచ్చలవిడి రాజ్యం చేస్తున్నాయి. ప్రేమ గీమ అంతా షీర్ నాన్సెన్స్! బీదపిల్లలు, కట్నం యిచ్చుకోలేని తండ్రులూ తమ పిల్లలచేత మితాయి దుకాణాలు తెరిపించే రోజు అట్టే దూరంలో లేదు. ఈ లోగా ఏ దైనా మార్పురావాలి. వైవాహిక వ్యవస్థలో ఏదో మార్పురావాలి. విప్లవంలాటిది. లేకపోతే ఒక్క మొగుడ్ని సంపాదించ డంకోసం లక్షలూ వేలూ ఎవడు తెచ్చి గుమ్మరించ కలడు?

ఈ చెడుకంపుని యింపుగా చూపించి ఎనిమిది కారులూ. ఆరు లొట్టిపిట్టలు, పదిబంగళాలు, హెలికాప్టర్లూ, విమానాలమీంచి కధనడిపిం చుకుపోవడం నాకు చాతకాదు.

పెళ్ళిళ్లు చాలా సింపుల్‌గా జరిగిపోయి ఎవరూ దివాలా తీయ కుండా సుఖంగా సంతోషంగా కథ కంచికి మనమింటికి అనేట్లు గడిపే రోజులు రావాలి. కాని ఈ పొడుండొక్కలు, ఖద్దరులాల్చీలు జరీకండు వాలు, పాంకోళ్లు, బట్టతలలు, పులిమీసాలవాళ్ళు పెళ్ళిళ్ళను ఆస్తులమార్పి డికి, లాభసాటి వ్యాపారంగా నిర్వహించినంత కాలం చిట్టెమ్మలు కాలి రాలిపోక తప్పదు.

ఆడపిల్ల జీవితంచుట్టూ సమాజం ముళ్ళకంపలూ-బ్రహ్మ జెముడు డొంకల్ని పరిచింది. ఏ రాంమోహనరాయో, ఏగురజాడో ఏ వీరేశలింగమో దిగిరావాలి. ఈ సంఘాన్ని ఉద్ధరించేందుకు. కాదూ అంతా బాగుంది-ఎవ్వెరిథింగ్ ఓ. కె. అంటారూ-చిత్తం! చిత్తం! చిట్టెమ్మ ఇడియట్! మీరంతా చక్కని సమ్మంధం చూసి సుబ్బారావుకి ముడెట్టండి. పెళ్ళి పన్లు చెయ్యడానికి గం. భా. స. వెంకటలక్ష్మీనరసమ్మ వస్తుంది లెండి.

(లత - ఏప్రిల్ 1968)

—///—